
# "ఏవి తల్లీ నిరుడు కురిసిన...."

కేతవరపు వెంకట రమణమూర్తి

"పన్నెండేళ్ళు, ఎంత తేలిగ్గా గడిచిపోయాయి? నిన్ననో, మొన్ననో అయినట్టుంటుంది ఈ వూళ్ళు విడిచిపెట్టి". ఏం మారలేదు. బందరు మునిసిపాలిటీగా మారి నూట పదేళ్ళయింది.




అయినా ఓ కుగ్రామంలా వుంది. పెద్ద పెద్ద గోతులతో, రోడ్లమీదే పారుతున్న మురికికాలవలతో ఓ వందేళ్ళు వెనకాల వుంది. జనాభా పెరగడంతో, రోడ్లకటూ, ఇటూ ట్రాఫిక్‌కి అడ్డం వస్తూ, జనాభా అవసరాలు తీర్చడం కోసం వెలసిన చిన్న చిన్న బడ్డీ దుకాణాలు, మనుషులు కూడా ఏం పట్టనట్టు ఆ మురికి నీళ్ళల్లోనే నడుస్తూ, ఆ వాసనే పీలుస్తూ తిరుగుతున్నారు. ప్రపంచం అంతా మారినా ఈ ఊరు మారలేదు.

పన్నెండేళ్ళ క్రితం తను పబ్లిక్ సర్వీస్ కమీషన్ పరీక్ష పాస్ అవడం, బ్రాడ్‌కాస్టింగ్ మినిస్ట్రిలో ఉద్యోగం రావడంతో, వున్న ఒక్క తల్లినీ తీసుకుని ఢిల్లీ వెళ్ళిపోయాడు. ఆ తర్వాత ఇటు రావడమే పడలేదు. కానీ అందరి స్నేహితుల క్షేమ సమాచారాలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూనే వున్నాడు. ఎప్పుడో బుద్ధిపుట్టినపుడు ఓ ఉత్తరం ముక్క రాయడం, జవాబు వస్తే ఆనందించడం పరిపాటి అయింది.

కాలింగ్ బెల్ మోగడంతో ఆలోచనల్లోంచి బయట పడ్డాను. హోటల్ రూంబాయ్ కాఫీ తెచ్చి బల్లమీద వుంచాడు. టైము చూసుకుంటే నాలుగయింది. శీతాకాలమేమో అప్పుడే చీకటి తెరలు దిగడానికి సిద్ధంగా వున్నట్టున్నాయి. ఓ పక్క నీరెండ. ఒక్కసారి కాలేజీకి వెళ్ళి చూస్తే ఎలా వుంటుంది అనిపించింది. అనుకున్నదే తడవుగా బయల్దేరాను.

"ఆంధ్ర జాతీయ కళాశాల" కొత్త బోర్డు దర్శన మిచ్చింది ఎదురుగా. మనసు ఆనందమో, విషాదమో తెలియని స్థితిలో వుండి పోయింది. పుష్కరం క్రిందట తను ఈ కాలేజీ నుంచి - బయటకు వచ్చాడు. మళ్ళీ ఇదే చూడటం. గేటు ముందర మోకాళ్ళ మీద కూర్చుని చేత్తో ఆ మట్టిని నిమిరాడు. ఎన్ని వేలసార్లు ఈ మట్టిమీద నడిచాడు? తనూ, తన క్లాస్‌మేట్స్ అయిన జగన్, రఘురామ్, టి.వి.గాడు, రాంబాబు, ప్రసాద్, చుక్కయ్య ఒక జట్టు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం నుంచి, డిగ్రీ ఫైనల్‌దాకా ఒకే క్లాసులో, ఒకే బెంచ్ మీద కూర్చుని చదువుకున్నారు. ఎన్.సి.సి., ఎన్.ఎస్.ఎస్‌లలో జట్టుగా జేరి క్యాంపులకి వెళ్ళేవారు. క్యాంపులు లేనపుడు కాలేజీ. ఎంత ఆనందంగా వుండేవి ఆ రోజులు?


నిదానంగా నడుచుకుంటూ వాలీబాల్ కోర్టు దగ్గరకు వచ్చాను. ఇంగ్లీషు పద్ధతిలో కట్టిన పెంకుటిల్లు అలాగే వుంది. దాంట్లోనే బి.ఏ. హిస్టరీ క్లాసులు జరిగేవి. దాని పక్కనే పెద్ద రావి చెట్టు వుండేది. క్లాసులు లేనపుడు వచ్చి ఆ చెట్టు కింద కూచునే వాళ్ళు తామందరూ. చెట్టుమీద చేరిన చిలకలు కిచకిచమంటుంటే, పక్కనే వున్న హాకీ ఫీల్డులో ఆడుతున్న వాళ్ళ అరుపులు, రంగు రంగు సీతాకోక చిలకల్లా పాడు గాటి జడలతో వినపడీ, వినపడనట్టు, సంగీతం పాడుతున్నట్టున్న గొంతులతో నడచి వెళ్ళే ఆడపిల్లలతో ఆ ప్రదేశం అంతా అదో విధమైన సందడిగా వుండేది. తూర్పుగాలి మెల్లమెల్లగా వీస్తుంటే, క్లాసులో పాఠాలు వినీవినీ వేడెక్కిపోయిన మనసు, శరీరం సేద తీరినట్టుండేది.

ఇప్పుడు ఆ రావి చెట్టు ఎండిపోయింది. కొమ్మలు మాత్రం ఆకాశంలోకి చొచ్చుకుపోయి గతజలసేతు బంధనానికి ప్రతీకగా, గంభీరంగా వున్నాయి. పాడిపాడి అలసిపోయినట్టు, గతచరిత్రకీ, వర్తమానానికీ వంతెన వేద్దామని ప్రయత్నం చేస్తూ ఓడిపోయిన ట్టున్న ఓ వంటరి పిట్ట విచారంగా, చిటారు కొమ్మన నిశ్శబ్దంగా కూర్చుని వుంది. అస్తమిస్తున్న సూర్యుడు కొమ్మల్లోంచి బంగారు కిరణాలను ప్రసారం చేస్తున్నాడు.

"అవును, ఇక్కడే తామందరూ యన్.సి.సి. డ్రిల్ చేసింది. ఇప్పటికీ 'లెఫ్ట్,రైట్,లెఫ్ట్' అంటూ అరుస్తున్న ట్రైనర్ గొంతు తన మనసులో పచ్చపచ్చగా వుంది.

ఉదయాన్నే గడ్డిపోచల మీద పరుచుకున్న మంచు సూరీడి కిరణాలకి మెరుస్తుంటే, మిలటరీ వాళ్ళకి మల్లే చురకత్తిలా ముడతలు వుండేట్టు గంజిపెట్టి ఇస్త్రీ చేసిన యూనిఫాం వేసు కుని, క్యాప్‌మీద ఎర్రటి పింఛం గాలికి అల్లల్లన ఊగుతుంటే, ఆ కమాండ్స్ తప్పకుండా అందరూ డ్రిల్ చేయడం, మధ్యమ ధ్యలో జగన్ చిలిపిగా అల్లరి చేయడం, బ్రేక్‌ఫాస్ట్ సర్వ్ చేసే సమయంలో క్యాంటీన్ సూపర్‌వైజర్ గోపీచంద్‌ని కాకాపట్టి తమ బేచ్‌కి ఎక్కువ టిఫిన్ తీసుకు రావడం,. అంతా ఓ కలలా వుంది.

"ఓహ్.... ఇదంతా ఇప్పుడే జరిగినట్టుంది. ఎంతలో ఎంత మార్పు? నిట్టూరుస్తూ క్రికెట్ పిచ్, ఫుట్‌బాల్ గ్రౌండ్ దాటి ఆడిటోరియం దగ్గరకి వచ్చి నిలబడ్డాను. ఒక్కసారి మనసు ఆర్ద్రం అయిపోయింది. ఇక్కడే డిబేట్లు, క్విజ్ కాంపిటేషన్లు, ప్రతి సంవత్సరం కల్చరల్ షోలు జరిగేవి. తను కాలేజీలో కవిగా, క్విజ్ మాస్టర్‌గా అందరికీ సుపరిచితుడు. ఎన్నో సంవత్సరాలుగా క్విజ్‌లో కాలేజీకి ఒక్క షీల్డూ రాక మొహం వాచినట్టున్న సమయంలో తను స్టేట్ లెవెల్ కాంపిటీషన్‌లో పాల్గొని తమ




కాలేజీకి షీల్డ్ తీసుకొచ్చాడు. ఆ సందర్భంగా ప్రిన్సిపాల్ అవధా నిగారు తనని ఈ ఆడిటోరియంలోనే అభినందించి సన్మానం చేశారు. అపుడు తన క్లాస్‌మేట్ శ్రీవల్లి తనని ప్రేమించడం, తామిద్దరూ క్లాసులు లేని సమయంలో, కాలేజీ వెనకాలే వున్న జామతోటల్లో కలిసి విహారం చెయ్యడం, గుర్తుకు వచ్చి మనసు రెక్కలు కట్టుకుని ఎగిరింది. ఈవెంట్యువల్‌గా తామిద్దరూ పెళ్ళి చేసుకోలేక పోవడం కూడా గుర్తుకు వచ్చి మనస్సు భారమైంది.

ఆకాశం కెంజాయి రంగులోకి మారింది. గుంపులు గుంపు లుగా ఇళ్ళకి తిరిగి వెళ్తున్న పిట్టలు కాలేజీ దగ్గరకి వచ్చి, ఒంటరిగా నిలబడుంది ఎవరా అన్నట్టు ఓ సారి తొంగి చూసి, తనని గుర్తుపట్టినట్టు "ఓహో నువ్వా" అని ఆనందంతో గిరికీలు కొట్టి మళ్ళీ వెళ్ళిపోతున్నాయి. ఆదృశ్యం చూడ్డానికి మనోహరంగా వుంది.

వర్డ్‌వర్త్ పొయ్‌ట్రీ గుర్తుకు వచ్చింది. నదుల గట్ల వెంబడి, మైదానాల్లోనూ, పచ్చిక బయళ్ళమీదా అందంగా పెరిగిన డెఫొడెల్స్ పూవులు గాలికి నృత్యం చెయ్యడం, నదుల్లో పూల కన్నెలు అలవోకగా తేలి వెళ్ళడం, మొదటిసారి వాన పడ్డప్పుడు భూమి ఆవిర్లు చిమ్ముతూ అదోరకం సువాసనల్ని వెదజల్లటం, ఓహ్.. ఎంత మధురమైన వర్ణన. ఎంత అందంగా వుంది?

మనసంతా మెలాంకలిక్ మూడ్‌లోకి మారిపోయింది. ఒక్క సారిగా ప్రకృతంతా తన అందాన్ని కట్టకట్టుకు వచ్చి తన మనసులో తిష్ట వేసుకున్న భావన. ఆనందాన్నంతా అనుభవించ లేక గుండె బరువుతో ఒంటరిగా నేను. కళ్ళ గదుల్లోంచి తన్నుకొస్తున్న కన్నీరు. చెంపల మీదకి జారిన వెచ్చటి కన్నీటిని చేత్తో తుడుచుకున్నాను. దట్టమైన చీకటి ఎప్పుడు కమ్ముకుందో

చూడనే లేదు. పల్చగా పట్టిన పొగ మంచుని చీల్చుకుని వెన్నెలని కురిపించడానికి వెండి రథం మీద వస్తున్న చంద్రుడు.

కాలేజీ బిల్డింగ్స్ మీద వెలుగుతున్న లైట్లు, గోడలమీద పరచుకున్న నీడలు, ఒకదానితో ఒకటి ఆడుకుంటున్నట్టు అగుపిస్తున్నాయి. అంతటా పరచుకున్న గాఢమైన నిశ్శబ్దం. ఎవరో కవి అన్నట్టు నిశ్శబ్దం ఎంత మధురంగా వుంది? వినగలిగిన వాడికి సంగీతం వినిపిస్తుంది.

నిదానంగా నడుచుకుంటూ బయటికి వచ్చాను. అడుగుముందుకి పడట్లేదు. ఇన్నాళ్ళూ ఈ మధుర స్మృతులు తనలో ఎక్కడ దాక్కున్నాయ్? ఒక్కసారి ఉప్పెనలా తరుముకొచ్చినాయి. మళ్ళీ తిరిగి వీటన్నిటినీ తన స్నేహితుల్తో పంచుకోగలిగితే? ఒక్కసారి ఒక్కసారంటే ఒక్కసారి. ఆలోచనల్లోపడి ఎప్పుడు వచ్చానో హోటల్ ముందు నిలబడి వున్నాను. రూమ్ బాయ్ పరిగెట్టుకుంటూ వచ్చాడు. చేతిలో వున్న కెమేరాని అందుకుని ముందుకు నడిచాడు. వెనకాలే నేను.

ఆ రాత్రంతా నిద్రలేదు. సిగిరెట్ మీద సిగిరెట్ కాలుస్తూ, ఎప్పుడు తెల్లవారుతుందా, ఎపుడెపుడు స్నేహితుల్ని కలుసుకుందామా అని మనసు ఉవ్విళ్ళూరుతోంది. తెల్లవారు ఝామున ఎపుడు పట్టిందో కునుకు. ఓ కల. కాలేజీలో తను ప్రేమించిన శ్రీవల్లి, చేతిలో అందమైన పాపాయిని ఎత్తుకుని నా దగ్గరికి వచ్చింది. నేను ఒక్కసారి ఆనందంతో ఆమెని దగ్గరకి తీసుకోబోయాను. నవ్వుతున్న శ్రీవల్లి గుడ్లెర్ర చేసింది. “ ఆగు నన్ను ముట్టుకోకు. పిరికివాడా. ప్రేమించానని చెప్పి, పెళ్ళి దగ్గరకి వచ్చేసరికి పారిపోయావ్. ఒక్కమాట, కనీసం ఒక్కమాట కూడా చెప్పకుండా వెళ్ళిపోయావ్. ఛీ, చూడు నేనెంత ఆనందంగా వున్నానో, నువ్వే, ఇంకా అలా తిరుగుతున్నావ్. ఇదంతా నా ఉసురు ఫలితమే! అనుభవించు. జీవితంలో నీకు పెళ్ళికాదు. ఏ ఆడపిల్లా నిన్ను ప్రేమించదు.” అంటూ వెక్కి వెక్కి ఏడవడం మొదలు పెట్టింది. నేనేం చెబుదామన్నా ఎవరో గొంతు నొక్కేసినట్టు మాటలు రావడం లేదు. “నేను కాదు కారణం” అని ఎట్లాగో గొంతు పెగుల్చుకుని అన్నాను.

ఇంతలో పెద్ద పెద్ద చేతులు వచ్చి నా గొంతుని పట్టుకున్నాయి. మరి మాట్లాడనివ్వకుండా ఆ చేతులకి పెద్ద తల మొలిచింది. అది క్రమక్రమంగా శ్రీవల్లీ వాళ్ళ నాన్న రూపం దాల్చింది.

“ఇంకొక మాట మాట్లాడావా నీ పీక పిసికేస్తాను. ఆ రోజు మాట ఇచ్చావు గుర్తుందా? మాట తప్పావా సుఖంగా కాపురం చేసుకుంటున్న నీ ప్రియురాలు, శ్రీవల్లిని చంపేస్తాను నా కూతురు అని కూడా చూడకుండా. దాని సుఖం కావాలో, దాని చావు కావాలో తేల్చుకో” అంటూ గట్టిగా అరిచిందది. శ్రీవల్లి గట్టిగా అరచి ఆ చేతుల్ని నామీదనుంచి తప్పించడానికి ప్రయత్నం చేస్తోంది. గట్టిగా విదిల్చికొట్టాయి ఆ చేతులు. శ్రీవల్లి గోడక్కొట్టుకుని అచేతనంగా పడిపోయింది.

అదిరిపడి లేచి కూర్చున్నాను. గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. ఒళ్ళంతా చెమటలు పట్టింది. టైము చూశాను. తెల్లారు ఝాము అయిదయింది. లేచి కిటికీ దగ్గరకెళ్ళి సిగిరెట్ వెలిగించాను.

ఇన్నాళ్ళూ మనసులో బంధించిన జ్ఞాపకాలు, మెదడు పొరలు చీల్చుకుంటూ బయటకి వస్తున్నాయి. శ్రీవల్లిని తను పెళ్ళి చేసుకుందామనుకున్నాడు. కానీ వాళ్ళ నాన్న వచ్చి బెదిరించాడు. మేమిద్దరం కనక పెళ్ళి చేసుకుంటే శ్రీవల్లిని చంపేస్తానన్నాడు. నాకు డబ్బు లేకపోవడం. ఒకటి వాళ్ళకులం, మా కులం వేరు కావడం రెండు. ఈ కారణాల వల్ల ఆయనకి మేము పెళ్ళి చేసుకోవడం ఇష్టం లేదు.

ఆయన అన్నంతపనీ చేస్తాడనీ నాకు తెలుసు. ఊళ్ళో ఆయనకున్న పలుకుబడీ, డబ్బూ అందుకు సాక్ష్యాలు. శ్రీవల్లి ఎక్కడవున్నా, ఎవరి భార్య అయినా తను బతికి వుంటే చాలు అని అనుకున్నాను. అందుకే శ్రీవల్లికి చెప్పకుండా, కనీసం కలిసి తిరిగిన స్నేహితులెవరికీ తెలియ చేయకుండా, ఉద్యోగం రావడంతో ఢిల్లీ వెళ్ళిపోయాను. ఆమె క్షేమం దృష్ట్యా. తర్వాత శ్రీవల్లి చాలా బాధపడుతోందని ఎవరో చెప్పగా విన్నాను.

మనసు బాధగా మూలిగింది. ఏమిటీ జీవితం. అన్నీ బాధలే! డబ్బులేక పోతే సమకూర్చుకోవచ్చు. కానీ మనసుకి గాయం అయితే, బాధలతో పేదదయితే దానికి ముక్తి ఎప్పుడు? జవాబు దొరకని ప్రశ్న.

ఒక్కసారి స్నేహితులతో బాటు శ్రీవల్లిని కూడా కలుసుకోవాలనుకున్నాను. తను, భర్తా ఇద్దరూ బందరులోనే వున్నారని తెలిసింది.

* * *

“జగన్, అడ్వొకేట్” అని బోర్డు వున్న ఇంటి ముందాగాను. ఆ ఇల్లు ఏం మారలేదు. అలాగే వుంది. ఇంటి ఎదురుగా వున్న ప్రిన్స్ టైలర్స్ కొట్టూ అలానే వుంది వ్యాపారం బాగా సాగుతున్నట్టుంది. చాలా రద్దీగా వుంది.

కాలింగ్ బెల్ నొక్కాను. ఎవరిదో అడుగుల సవ్వడి. ఊపిరి బిగపట్టాను. ఆ వచ్చేది ఎవరు? జగన్, భార్య అరుణా? తలుపులు తెరుచుకున్నాయి. లోపల టి.వి లోంచి క్రికెట్ కామెంటరీ వినబడుతోంది. జగన్! ఎంత మారిపోయాడు? సన్నగా పొడుగ్గా వుండేవాడు. బాగా ఒళ్ళు వచ్చేసింది. చెవుల దగ్గర జుట్టు తెల్ల బడుతోంది.

తలుపుకి అడ్డంగా నుంచుని, ముఖం బయటపెట్టి “ఎవరు కావాలి?” అనడిగాడు. గొంతులో అసహనం ధ్వనిస్తోంది. నన్ను గుర్తుపట్టలేదు. అప్పుడే టీ.వి చూసి రావడం మూలాన అలా అయుంటుందని సమాధాన పర్చుకున్నాను.

“నేనురా.... కిరీటిని....” ఇంకేం చెప్పాలో తెలియక ఆపాను. ఆ కళ్ళల్లో నేనూహించిన రియాక్షన్ కనబడలేదు.

“నువ్వా, ఏంటి?” ప్రశ్నించాడు తిరిగి. మనసు బాధగా మూలిగింది. తేరుకుని “రా లోపలికి” అన్నాడు.

సోఫాలో కూర్చున్నాం. ఎదురుగుండా వున్న టి.వి.లోంచి క్రికెట్ మ్యాచ్ ప్రసారం అవుతోంది. మారు మాట లేకుండా దాన్నే చూస్తున్నాడు తదేకంగా. పన్నెండేళ్ళ తర్వాత కలుసుకున్న ఆనందం గానీ, ఉత్సాహంగానీ ఏ కోశానా కనబడలేదు నాకు ఆ ముఖంలో.

నేనే తిరిగి ప్రశ్నించాను “ఎలా వున్నావు జగన్” అని. “బానే వున్నాను” అంటూ టి.వి. చూడ్డంలో మునిగి పోయాడు. ఓ పది నిమిషాలు నేనే అవీ ఇవీ ప్రశ్నలు వేశాను. ఒకటి రెండు “ఆ...ఊ...”లు తప్ప ఏం మాట్లాడలేదు వాడు. నాకు

అర్థం అయింది. పూర్వం మనిషికాదు కాదు వీడు. బాధవేసినా, నవ్వుతూ "వస్తా(నా" అంటూ లేచి నిలబడ్డాను.

"సరే. అన్నాడు. గొంతులో రిలీఫ్ కనబడుతోంది. క్రికెట్ మ్యాచ్ చూడ్డానికి అడ్డులేదు కదా! అనుకుంటూ రఘురాం ఇంటికేసి నడిచాను.

ఆ రోజు సాయంత్రం వరకూ అందరిళ్ళనీ చుట్టబెట్టాను. కానీ ఎవరిలో నేనూహించిన పాత జ్ఞాపకాలుగానీ, ఆ మధుర స్మృతులు గానీ మిగిలి వున్నట్టు కనిపించలేదు.

రఘురాం తను చేస్తున్న వ్యాపారం గురించి చెప్పాడు. తాను కడుతున్న సినిమాహాలు, దానికెంత ఖర్చయింది, ఎంత లాభం రావచ్చు వగైరాలు. వెన్నెల రాత్రుల్లో, ఊరి చివర కల్వర్టు మీద అర్ధరాత్రి దాకా కూర్చుని సిగిరెట్లు కాలుస్తూ గడిపిన రోజులు గుర్తుచేయడానికి నేను రెండు మూడుసార్లు ప్రయత్నం చేయబోతే "అదంతా "చైల్డిష్‌నెస్" అంటూ తోసేసాడు. మరి మాట్లాడకుండా తిరిగి వచ్చేసాను.

రాంబాబు, టి.వి.గాడి ఇళ్ళ దగ్గరా అదే చేదు అనుభవం. తాము చేస్తున్న బ్యాంక్ ఉద్యోగాల గురించీ, బోనస్‌లు, డి.ఎ.ల గురించీ, తాము కొన్న స్కూటర్ల గురించీ చెప్పుకొచ్చారు.

కాలేజీలో రావి చెట్టు క్రింద కూర్చుని చేసిన అల్లరి, ఎన్.సి.సి క్యాంపులు, పాటలు, వీటి గురించి నేను మాట్లాడ బోతే, "ఏంటోరా, అదంతా తెలీక చేసిన అల్లరి, చిన్నతనం గదా, దాన్ని తల్చుకుంటేనే సిగ్గేస్తోంది" అంటూ తుంచేశారు మాటల్ని మధ్యలోనే!

"సిగ్గేస్తోందట" వాడికి అవి తల్చుకుంటే, నాకు చెప్పలేని బాధ కలిగింది. ప్రసాదు దగ్గరకి వెళ్ళాను. వాడేదో ప్రయివేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. గడ్డం పెంచుకుని, కళ్ళజోడు పెట్టుకుని సీరియస్‌గా రాసుకుంటున్నాడు. వాడికోసం ఓ గంట వైట్ చేయాల్సొచ్చింది. చివరికి ఇద్దరం బయటకి వచ్చాం.

జీతం పెంచమంటె పెంచడట వాళ్ళ బాస్. పొద్దున ఎనిమిది గంటలకి ఆఫీసుకెళ్తే, రాత్రి పదవుతుందట ఇంటికి చేరేసరికి. స్వంతపనులన్నీ వీడే చేయాల్ట. ఆఫీసుకు ఎవరొచ్చినా టీలు, కాఫీలు, సిగిరెట్లు వీడే సప్లయి చేయాలట. "ఎం.కాం. చదివి ఇలా అయ్యానురా" అని బాధపడ్డాడు.

కాలేజీ రోజుల్ని గుర్తు చేస్తే మరింత బాధ పడ్డాడు. "గుర్తు చేయకురా వాటిని. అవి తల్చుకుంటే, ఇప్పుడు చేస్తున్న పని కూడా చెయ్యలేను. మర్చిపో అదొక పీడకల" అన్నాడు.

శ్రీవల్లి గురించి ఎత్తాను. "శ్రీవల్లికేరా, చక్కగా పెళ్ళి చేసుకుంది. ఇద్దరు పిల్లలు. ఈ మధ్య కలిసినపుడు మీ ప్రేమ ప్రస్తావన వస్తే, "ట్రాష్... అదంతా.... అతన్ని చేసుకుంటే బంగారం లాంటి నా భవిష్యత్తునీ, మా అమ్మనీ, నాన్ననీ, అందర్నీ వదులుకోవాల్సొచ్చేది. మానాన్న ఆ రోజు మంచి నిర్ణయం తీసుకున్నాడు" అందిట.

ఎవరికోసం ఉన్న ఊరుని, స్నేహితుల్ని వదిలి దూరంగా వెళ్ళానో, ఎవరిని తల్చుకుంటూ ఇన్నాళ్ళూ జీవితాన్ని వ్యర్థం చేశానో,..... తల్చుకుంటే అదంతా బూడిదలో పోసిన పన్నీరైన ట్టుంది. నా ఆఖరి ఆశ ఇలా దురాశగా, వ్యర్థంగా మారింది.

"ఏమైంది వీళ్ళకి? స్నేహం, దాని మాధుర్యం, ప్రేమ దాని త్యాగం వీళ్ళెవరికి అర్థం కావా? నేనొక్కడినే గతంలో బతుకు తున్నానా? లేక వీళ్ళే సంసారాల్లో పడి అన్నీ మరిచిపోయారా? జీవితంలోని మాధుర్యాన్ని చంపేసుకుని యాంత్రికపు బతుకు బతుకుతున్నారా?

కానీ అవి తిరిగి రాని రోజులు. 'ఒకడికవి "చైల్డిష్ నెస్" ఇంకొకడి కది "చిన్నతనంలో చేసిన అల్లరి" మరొకడికది "తల్చుకుంటేనే సిగ్గేస్తోంది" ఇంకొకడకది" చెత్త"

తల్చుకుంటేనే మది గవాక్షాలని తెరిచి, ఒళ్ళు పులకరింప చేసే అనుభూతులని పూర్తిగా మరిచిపోయారు. వీళ్ళేం పోగొ ట్టుకుంటున్నారో ఏం పారేసుకున్నారో వీళ్ళకి తెలియదు. గతం అనేది వీళ్ళెవరికీ!

ఇహ బందరులో వుండటం అనవసరం అనిపించింది. వెంటనే హోటల్ గది ఖాళీ చేసి బస్టాండ్‌కి బయలుదేరాను.

బస్సు బయలుదేరింది. పొలాల మధ్యనించి వెళ్తోందేమో, చల్లగాలి శరీరాన్ని మెల్లగా స్పర్శించింది. ఎప్పుడో, ఎక్కడో చదివిన కవిత జ్ఞాపకం వచ్చింది "ఏది తల్లీ నిరుడు కురిసిన హిమసమూహములు...." ఎప్పుడు నిద్రలోకి జారానో నాకే తెలియదు.

